క్లుప్తంగా

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక అమ్మ వారిశాలలో వాసవీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు సగళా మహేంద్రబాబు, కార్యవర్గ సభ్యులు వాసవీ కన్యకాపరమేశ్వరీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం పులివెందుల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వారు 20 మంది నిరుపేద వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వాసవీ క్లబ్ కార్యదర్శి హరికిరణ్, ట్రెజరర్ వినోద్‌కుమార్, ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త రవి కుమార్, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్, లార్వా సర్వేలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని బాకరాపురంలో మంగళవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. నిల్వఉన్న నీటిలో అబేట్ పిచికారి చేయించి ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి మూడు సార్లు ల్యాబ్‌కు అందజేయాలన్నారు. మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించి మలేరియా వచ్చిన వ్యక్తి గ్రామంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేసి గ్రామంలోని ప్రజలందరికీ రక్తపరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుబహాన్‌బీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిలిన వైద్య బృందం

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని ప్రకాశ్‌నగర్ కాలనీలో వైద్య బృందం డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం పర్యటించి కాలనీ వాసులకు వ్యాధుల నివారణపై తగు సూచనలు చేశారు. ఇంటి చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. డెంగీ వ్యాధి రాకుండా చర్యలు తీసుకోవాలని ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారు లక్షుమయ్య, సూపర్‌వైజర్ ఓబులేసు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రాజీనామా

వీరపునాయునిపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి మంగళవారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతో పాటు వీరపునాయునిపల్లె జెడ్పీటీసీ సభ్యురాలు నిమ్మకాయల రాజేశ్వరి, పాయసంపల్లె ఎంపీటీసీ రామాంజనేయరెడ్డి, యరమలపల్లె మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, గోనుమాకులపల్లె సహకార సంఘం మాజీ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, మరికొంతమంది నాయకులు తమ సభ్యత్వాలకు రాజీనామా చేశారు.

దేవుడి స్థలాలను కాపాడండి

వేంపల్లె : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో ఉన్న శ్రీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి 416 సర్వే నంబర్‌లో 70 సెంట్లు స్థలం కోట్లు విలువ చేస్తుందని, అక్రమణదారుల నుంచి కాపాడాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, బీజేపీ నాయకులతో కలసి ఆ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు కె రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బూస్టర్ డోస్ టీకా తప్పనిసరి

ఎర్రగుంట్ల : దూడలకు గాలికుంటి వ్యాధి రాకుండా ఉండేందుకు తప్పనిసరిగా బూస్టర్ డోస్ టీకాను వేయించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టరు మునెయ్య తెలిపారు. మండలంలోని ఇల్లూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ శనగపంట రాబోయే సీజన్‌లో సాగు చేసే రైతులు విత్తన శుద్ధి చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక పథకాలను తెలియజేయండి

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పశుసంవర్ధక శాఖ పరిధిలో ఉన్న పథకాలను పాడి రైతులకు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ డి.వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం చిలంకూరు గ్రామంలో ఉన్న పశుసంవర్ధశాఖ వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సమగ్ర తనిఖీ చేశారు. రిజిస్టర్, మెడిసిన్స్, వ్యాక్సిన్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ బి.మునెయ్య, చిలంకూరు వెటర్నీ ఆసుపత్రి డాక్టర్ మహేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

వీరపునాయునిపల్లె : రైతులను అన్ని విధాలా ఆదుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని అలిదెన గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు రైతులు పాటించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఉల్లి పంటను బెడ్ పద్ధతిలో సాగు చేసినట్లయితే దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమంగా తరలింపు



టిప్పర్‌లో గ్రావెల్‌ను లోడ్ చేస్తున్న హిటాచీ (ఫైల్)



గ్రావెల్‌ను తరలించడానికి సిద్ధంగా ఉన్న వాహనాలు(ఫైల్)

కమలాపురం : మండలంలోని నల్లింగాయపల్లె గుట్ట నుంచి అక్రమార్కులు గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారు. పది రోజులుగా గుట్ట వద్ద హిటాచీ, టిప్పర్లు ఏర్పాటు చేసుకుని అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వారం రోజుల క్రితం గుట్ట వద్దకు వెళ్లి పరిశీలించారు. అనుమతులు లేకుండా గ్రావెల్ ఎలా తరలిస్తారని ప్రశ్నించగా ఈ గ్రావెల్ గ్రీన్ హైవే రోడ్డు నిర్మాణానికి తరలిస్తున్నామని, కార్యాలయానికి వచ్చి అనుమతి తీసుకుంటామని అక్రమార్కులు అధికారులకు తెలిపారు. అయితే ఇంత వరకు ఎలాంటి అనుమతులు లేకుండానే గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ విషయంపై మండల తహసీల్దార్ శివరామిరెడ్డిని వివరణ కోరగా తమ సిబ్బంది వారం రోజుల క్రితం అక్కడికి వెళ్లి అనుమతులు తీసుకున్నంత వరకు గ్రావెల్ తరలించ వద్దని చెప్పారన్నారు. అయితే ఇంత వరకు వారు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, రేపు అక్కడికి వెళ్లి విచారించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఆసుపత్రి పరిసరాల్లో శుభ్రం చేస్తున్న విద్యార్థులు

కమలాపురం : ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ అశోక్‌కుమార్, అయ్యవారు తెలిపారు. మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం వలన వ్యాధులు ప్రబల కుండా ఉంటాయన్నారు. తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో సామాజిక పరిశుభ్రత కూడా అంతే ముఖ్యం అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలు, చుట్టు ప్రక్కల ప్రాంతాల శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగాల : కోమన్నూతల విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా వ్యవసాయానికి సంబంధించి బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ బాల సంజీవులు తెలిపారు. ప్రజలు, రైతులు గమనించి సహకరించాలన్నారు.

ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందిస్తాం

పులివెందుల టౌన్ : భవిష్యత్‌లో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. మంగళవారం నగరిగుట్ట సచివాలయం పరిధి అరబిందో పాఠశాల ఆవరణలో నిర్వహించిన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తైన సందర్భంగా ప్రజలు మెచ్చిన కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అపాలి

జమ్మలమడుగు : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం నష్టాలు వస్తున్నాయని సాకు చూపుతూ విశాఖను ప్రైవేట్ కంపెనీలకు కట్టుబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం వలన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై వత్తిడి తీసుకువచ్చి స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నైతిక విలువల ప్రాముఖ్యతపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతోపాటు మెమెంటోలను అందించారు. అలాగే క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ కొండారెడ్డి, కన్వీనర్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ శేషయ్య, కోశాధికారి హరిశ్చంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పులివెందుల రూరల్ : స్థానిక జెఎన్‌టీయూ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎన్‌టీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి శేషమహేశ్వరమ్మ మాట్లాడుతూ 1969 సెప్టెంబరు 24న మహాత్మా గాంధీ శత జయంతి సందర్భంగా అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ వి.కె.ఆర్.వి.రావు 37 విశ్వవిద్యాలయాలలో జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఈ పథకం అమలుకు సహాయం, సహకారాన్ని అడిగారని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞను చేయించి, పరిసరాల శుభ్రత, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను చేశారు. ప్రిన్సిపాల్ అరుణకాంతి మాట్లాడుతూ నిస్వార్థంగా విద్యార్థులు సమాజ సేవా కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ సురేష్‌రెడ్డి

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సైబర్ నేరాలు, మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, డ్రగ్స్, సూసైడ్ నివారణ, ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తాత్కాలిక ఆనందాల కోసం ప్రలోభాలకు, ఆకర్షణలకు గురై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. ఉన్నత లక్ష్యాలతో చదివి గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరిగిపోవడంతో సైబర్ మోసాలు జరుగుతున్నాయని.. వీటి బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యోగాంజనేయులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా గుణం అలవరుచుకోవాలి

పులివెందుల టౌన్ : విద్యార్థులు చదువుతోపాటు సమాజంపట్ల బాధ్యత, సేవా గుణం అలవరుచుకోవాలని ఫుడ్ అండ్ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ మాధవ తెలిపారు. మంగళవారం పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథక వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులచే పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ మాధవ మాట్లాడుతూ కళాశాల జాతీయ సేవా పథకం రెండు యూనిట్ల విద్యార్థి వలంటీర్లు కళాశాల దత్తత గ్రామమైన బ్రాహ్మణపల్లిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుక నిషేధంపై అవగాహన కలిగించి, గ్రామంలో ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను సేకరించి చెత్త కుండీలలో వేశారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థి వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సేవా పథకం దినోత్సవం



విద్యార్థులకు బహుమతిని అందిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో జాతీయ సేవా పథక దినోత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా హాజరై మాట్లాడారు. ఎలాంటి స్వార్థం లేకుండా కేవలం సేవాభావం కలిగి సమాజాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) విద్యా వాలంటీర్ల కృషి ఎనలేనిదన్నారు. అలాగే వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను డైరెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ట్రిపుల్ ఐటీలో మొత్తం 15 ఎన్ఎస్ఎస్ విభాగాలు ఉన్నాయి. ప్రతి విభాగంలో దాదాపు 100 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా గ్రామాలను దత్తత తీసుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఏఓ డాక్టర్ రవికుమార్, అకడమిక్ డీన్ రత్నకుమారి, ఎఫ్ఓ కోటేశ్వరి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మధుసూదన, అధికారులు, ఆర్కేవ్యాలీ పీఆర్ఓ డాక్టర్ తిరుపతిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాత్రిపూట అనవసరంగా ఎవరూ సంచరించకూడదు



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల రూరల్ : రాత్రిపూట అనవసరంగా పట్టణంలో ఎవరూ సంచరించకూడదని పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. మంగళవారం రాత్రి పట్టణంలో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించి 10 మంది పాత నేరస్తులను, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వివిధ పనులను చేసుకునే వారిని, అలాగే అనుమానస్పదంగా తిరుగుతున్న 70 మందిని పట్టుకుని వారిని విచారించి వారి యొక్క వివరాలు, గుర్తింపు పత్రాలను పరిశీలించారు. దొంగతనాల కేసులలో వారి పాత్ర ఏమైనా ఉందా అని విచారించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ సరైన గుర్తింపు పత్రాలులేని వారికి ఇళ్లు బాడుగకు ఇవ్వడం, వసతి కల్పించడం, పనిలో పెట్టుకోవడం చేయరాదన్నారు. పట్టణంలో జరిగిన దొంగతనం కేసులలో కొంత పురోగతి సాధించామని, త్వరలో దొంగలను పట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ జీవన్ గంగానాథబాబు, పులివెందుల రూరల్ సీఐ రమణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సమస్యలు లేకుండా చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ఎర్రగుంట్ల : మున్సిపాలిటీలో అన్ని వార్డులలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని తాగునీటి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. అలాగే వార్డులలో డ్రైనేజీ సమస్య లేకుండా చేయాలిన్నారు. సుమారు రూ.110 కోట్లతో ఎర్రగుంట్లకు ప్రత్యేక వాటర్ లైన్, ఓవర్ హెడ్ ట్యాంక్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పట్టణంలోని ప్రకాశ్‌నగర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు వేసి, వీధిలైట్లను బిగించాలని ఆదేశించారు. అన్ని రూపాలలో నిధులు వస్తున్నాయన్నారు.

బదిలీ అయిన కమిషనర్‌కు సన్మానం

మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య బదిలీ అయిన సందర్భంగా కౌన్సిల్ సమావేశ అనంతరం ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు కమిషనర్‌ను సన్మానించారు. అలాగే కొత్తగా విజయవాడ నుంచి వచ్చిన కమిషనర్ శేషపాణీను ఆహ్వానించారు.

బాస్కెట్‌బాల్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్, పీఈటీలు

వేంపల్లె : రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలలో వేంపల్లె శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. కడపలో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలలో అండర్ 14 విభాగంలో నలుగురు, స్టాండ్ బైలో నలుగురు, అండర్ 17 విభాగంలో ముగ్గురు, స్టాండ్ బైలో ఒక్కరు నిలిచారన్నారు. పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరచడంపట్ల కరస్పాండెంట్‌తోపాటు పీఈటీ మాస్టర్స్ సోమసుందర్ రెడ్డి, కృష్ణప్రసాద్‌లు ఎంపికైన విద్యార్థులను ప్రశంసించారు.

సాంకేతికతతో అధిక దిగుబడులు సాధించండి



కమలాపురం : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయంలో వస్తున్న సాంకేతికతను వినియోగించుకుని రైతన్నలు అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మీరాపురం, పుట్లంపల్లెల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని పంట పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు అందజేసి మాట్లాడారు. నేల ఆరోగ్యాన్ని మెరుగు పరచడం, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకతలను పెంచడం, రైతు ఆదాయం పెంచడం కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త మాధురి మాట్లాడుతూ రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సరస్వతి, జిల్లా వనరుల కేంద్రం ఏఓ పద్మజ, ఏఈఓ దస్తగిరి, వెటర్నరీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం రాచినాయపల్లె, రామనపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు గ్రామంలో పంటల సాగుపై రైతులతో చర్చించారు. కార్యక్రమంలో పశు వైద్య శాఖ అధికారి డాక్టర్ యరపురెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి, వీపీఏ సునీల్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

వల్లూరు : వరి పంటలో సరైన సస్యరక్షణ చర్యలను పాటించడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి సాయజ్యోతి తెలిపారు. మండలంలోని బాలుగారిపల్లె, ఇసుకపల్లెల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ వరి పంటను ఆశించిన ఆకునల్లి పురుగు లక్షణాలు, నివారణ చర్యలను గురించి వివరించారు. పశు వైద్యాధికారి మారుతీప్రసాద్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల : వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. మంగళవారం లోపట్నూతల గ్రామంలో పొలంబడి పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతు కె.లక్ష్మీనారాయణరెడ్డి సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించి వేరుకుళ్లు తెగులుతో వేరుశనగ చనిపోవడాన్ని గుర్తించారు. తెగుళ్లు, పురుగులు, సూక్ష్మ పోషక లోపాలను గుర్తించి వాటి నివారణకు ఏమి చేయాలన్నది తెలియజేశారు. కార్యక్రమంలో పశువైద్యధికారి డాక్టర్ మంగేష్, ఏఈఓ విక్టోరియా రాణి, ప్రకృతి వ్యవసాయ అధికారి భాస్కర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారి అరుణ రైతులు సాగు చేసిన మినుము, జొన్న పంటలను పరిశీలించారు.

వేంపల్లె : రైతులు తమ పంట పొలాల్లో నివారణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం పొలంబడి పిలుస్తోంది అనే కార్యక్రమంలో భాగంగా ఆయన బక్కన్నగారిపల్లెలో పంట పొలాలను సందర్శించి మాట్లాడారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. మంగళవారం మండలంలోని గంగనపల్లె, తిప్పిరెడ్డిపల్లెల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

వేముల : పంటల సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన దిగుబడులు సాధించేలా కృషి చేయాలని ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని దుగ్గన్నగారిపల్లె, చాగలేరు గ్రామాలలో ఏఓ చెన్నారెడ్డితో కలిసి ఆయన సాగులో ఉన్న పత్తి, ఉల్లి పంటలను పరిశీలించారు. అనంతరం ఏఓ చెన్నారెడ్డి మాట్లాడుతూ మండలానికి 450 ప్యాకెట్ల పొద్దుతిరుగుడు మినీకిట్లు మంజూరయ్యాయని.. వీటిని రైతులకు ఉచితంగా ఇస్తామన్నారు. పశువులకు వేసే గడ్డి వృథా కాకుండా పూర్తిగా ఉపయోగించుకునే దిశగా గడ్డి కోసే యంత్రం ద్వారా రైతులకు డెమో చూపించారు. వీఏఏ లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం కాదు.. మోసం చేసే ప్రభుత్వం

- సూపర్ సిక్స్ అమలు పరచలేక డైవర్షన్ రాజకీయాలు
- ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్న చంద్రబాబు
- మీడియా సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : ప్రభుత్వం మంచిదా? కాదా? అని డిసైడ్ చేయాల్సింది ప్రజలేగాని ప్రభుత్వ పెద్దలు, నాయకులు కాదని, అసలు ఇది మంచి ప్రభుత్వం కాదని, మోసం చేసే ప్రభుత్వం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తమ 100 రోజుల పాలనలో సూపర్ సిక్స్ అమలు చేయలేక డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్‌లో ఒక్క హామీ అయినా అమలు పరిచారా? అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు జగనన్న సంక్షేమ క్యాలెండర్ ప్రకారం పథకాలను నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ చేసే వారని గుర్తు చేశారు. పాఠశాలలు ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా? తల్లికి వందనం ఊసేలేదన్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తి అయినప్పటికీ అన్నదాత సుఖీభవ అడ్రస్సే లేదన్నారు. జగనన్న 2019 మే చివరిలో అధికారంలోకి వచ్చారని, 2019 డిసెంబర్‌లో అమ్మ ఒడి ఇచ్చారని, తర్వాత ఆరు నెలలకే 2020 జూన్‌లో కూడా ఇచ్చారని గుర్తు చేశారు. ఇలా ఆరు మాసాల వ్యవధిలో మీరు రెండు సార్లు తల్లికి వందనం ఇస్తారా? అని ప్రశ్నించారు. పింఛన్లు పంపిణీ చేశామంటున్నారు. దాదాపు 2 లక్షల పింఛన్లు కట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశామంటున్నారని, 25 వేల పోస్టులతో డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పి 16వేల పోస్టులతో డీఎస్సీ విడుదల చేశారని, అందులో 6వేల పోస్టులు వైఎస్సార్ సీపీ విడుదల చేసినవేనని స్పష్టం చేశారు. కనీసం వాటి గురించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. ఇప్పటి వరకు రూ.20వేల కోట్లు అప్పు చేశారని, అలాగే సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ఖజానా నింపుకున్నారని, సంపద సృష్టించడమంటే ఇదేనా? అని ఎద్దేవా చేశారు. ఖజానాను చూస్తుంటే సూపర్ సిక్స్ అమలు చేయలేమని భయం వేస్తోందని చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటన్నారు. 14ఏళ్ల అనుభవం ఏమైందని, ఖజానా ఎంత ఉన్నది హామీలు ఇచ్చేటప్పటికి తెలియదా? అని ప్రశ్నించారు. ఉచిత ఇసుక పేరుకేనని, ఉచితం అనేది కూటమి నాయకులకేనని, మిగిలిన వారికి అధిక ధరకు ఇసుక విక్రయిస్తున్నారని మండి పడ్డారు. స్వార్థ రాజకీయాల కోసం తిరుపతి వెంకన్న భక్తుల విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం మంచిదా? కాదా? అని ప్రజలు తేల్చాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, గంగాధర్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం'ను బహిష్కరిస్తున్నాం

మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా డైవర్షన్ రాజకీయాలతో కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు నేతృత్వంలో జరుగుతున్న ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల వైద్య కళాశాలకు సంబంధించి జాతీయ వైద్య విద్యా మండలి ఇచ్చిన 50 సీట్లను వద్దని బహిరంగంగా పులివెందుల ప్రాంతంపై అక్కసు వెళ్లగక్కినందుకు ఇది మంచి ప్రభుత్వం అనాలా అని విమర్శించారు. పాడా ఆధ్వర్యంలో పరుగులిడుతున్న పులివెందుల అభివృద్ధిని అధికారంలోకి రాగానే పాడా వ్యవస్థను అటకెక్కించినందుకు ఇది మంచి ప్రభుత్వం అనాలా అని ప్రశ్నించారు. పులివెందులను కూటమి నాయకులు విచ్చలవిడిగా జూదం, మట్కా, దొంగతనాలకు కేంద్రంగా మార్చి అర్థతలేని నాయకులకు అడ్డాగా పోలీసు వ్యవస్థను మార్చినందుకు ఇది మంచి ప్రభుత్వమా అని అన్నారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన ఏ ఒక్క హామీనైనా అమలు చేయనందుకు ఇది మంచి ప్రభుత్వం అనాలా అని అన్నారు. జాతీయ విపత్తు సంస్థ ఇచ్చిన ముందస్తు హెచ్చరికలను నిర్లక్ష్యం చేసి పదుల సంఖ్యలో ప్రాణాలను పొట్టన పెట్టుకున్నందుకు అనాలా ఇది మంచి ప్రభుత్వం అని అన్నారు. కక్ష పూరిత రాజకీయాలకు ఆజ్యం పోస్తూ వంద రోజులు సాగిన పాలనపై ప్రజలను మభ్యపెట్టేందుకు సాక్షాత్తూ శ్రీవెంకటేశ్వరస్వామి ప్రసాదంను అప్రతిష్ఠపాలు చేసి దుర్మార్గపు రాజకీయాలు చేసే టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు ప్రతి ఒక్కరికీ ప్రజల రూపంలో ఆ కలియుగ దైవం బుద్ధి చెప్పే రోజు వస్తుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.